## కెసిఆర్ అంటే మొక్క కాదు.. వేగుచుక్క

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావును సీఎం రేవంత్ రెడ్డి కలుపు మొక్క అని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. పీకేయడానికి కేసీఆర్ అంటే ఒక మొక్క కాదని... కేసీఆర్ ఒక వేగుచుక్క అని పేర్కొన్నారు. తెలంగాణను సాధించిన శక్తి కేసీఆర్ అని కొనియాడారు. కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తే చూస్తూ ఊరుకోబోమని కవిత హెచ్చరించారు. ముఖ్యమంత్రి, మంత్రులు తిట్లతోనే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదలై పారేవని... ఇప్పుడు తిట్లు పారుతున్నాయని మండిపడ్డారు. రైతుబంధును శాశ్వతంగా తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## నిజాం షుగర్స్ కన్సల్టెంట్‌గా ఫార్చున్

### రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణలోని నిజాం దక్కన్ షుగర్స్ పునరుద్ధరణకు సంబంధించి అధ్యయన బాధ్యతలను క్యాపిటల్ ఫార్చున్స్ కంపెనీకి రాష్ట్ర సర్కార్ అప్పగించింది. మార్చి లోపుగా నివేదికను అందచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిజాం షుగర్స్‌ను పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నేపథ్యంలో అందుకు చర్యలు చేపట్టింది. ఈ షుగర్స్‌ను పునరుద్ధరించినప్పటికీ, తాము నడపలేమని భాగస్వామ్య సంస్థ అయిన డెల్టా పేపర్స్ లిమె టెడ్ గతంలోనే ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సంస్థలో 51 శాతం వాటాను కలిగియున్న డెల్టాకు స్వస్తీ పలకా లంటే ఆస్థుల విలువ, సాంకేతిక స్థితిగతులు, న్యాయపరమైన చిక్కులు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిం చింది. ఇందులో భాగంగా నిజాం షుగర్స్‌పై అధ్యయనం చేసి ఆస్థుల విలువను లెక్కించి అవసరమైన సలహాలు, సూచనలతో నివేదికను సమర్పించడానికి క్యాపిటల్ ఫార్చున్స్ అను సంస్థను కన్సల్‌టెంట్‌గా ఎంపికచేసి బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం సదరు కన్సెల్‌టెంట్ షుగర్ ఫ్యాక్టరీ ఆస్తుల విలువ లెక్కింపుపై దృష్టి సారించింది. ప్రస్తుతం కర్మాగారాల్లో గల యంత్రం పరికరాలు వినియోగించే స్థితిలో ఉన్నాయా లేదా, మరమ్మతులతో నడిపించుకునే వీలు ఉంటుందా, లేదంటే కొత్తవి కొనుగోలు చేయాలా అన్న వివరాలు సేకరించనుంది.

## అదానీ అవినీతిపై చర్చ జరగకుండా

## రాజ్యసభ వాయిదా: అనిల్‌కుమార్‌యాదవ్

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** అదానీ అవినీతిపై అమెరికా ప్రభుత్వం ఇచ్చిన నోటీసులపై రాజ్యసభలో చర్చకు కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీలు మందాడి అనిల్ కుమార్ యాదవ్, నీరజ్ డాంగి, ఇమ్రాన్ ప్రతాప్ ఘుడి, ఇటీవల జరిగిన అజ్మీర్ షరీఫ్ దర్గా ఘటనపై , అదానీ పై అమెరికా ఇచ్చిన నోటీసులపై చర్చకు లఘుచర్చకు అనుమతించాలని సెక్షన్ 267 నోటీసు ఇచ్చారు. రాజ్యసభలో సోమవారం వీటిపై చర్చకు నిరాకరించడానికి అవకాశం లేకపోవడంతో రాజ్యసభ చైర్మన్ సభను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

## 5 నుంచి టిబిపిఒ మెరిట్ అభ్యర్థులకు

## సర్టిఫికెట్ వెరిఫికేషన్.. 7 వరకు కొనసాగింపు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్ శాఖలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్(టీబీపీవో) పోస్టులకి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపికైన మెరిట్ అభ్యర్థులకి ఈ నెల 5 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 5 నుంచి 7 వరకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వ హించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరు కాని వారు ఈ నెల 9న హాజరు కావాలని సూచించారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ నంబర్ 14/2022ను జూలై 7, 2022ను టీజీపీఎస్సీ జారీ చేసింది.

## అంబేద్కర్ వర్సిటీ బిఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్)

## నోటిఫికేషన్ విడుదల.. 21 వరకు దరఖాస్తు గడువు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బిఎడ్‌తోపాటు బిఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) అర్హత పరీక్ష నోటిఫికేషన్‌ను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జారీ చేసింది. బిఎడ్, బిఎడ్(స్పెషల్ ఎడ్యుకేషన్) 2024-25కి సంబంధించిన నోటిఫికేషన్ వర్సిటీ సోమవారం విడుదల చేసింది. నోటిఫికేషన్‌కి సంబంధించి ఆన్‌లైన లో దరఖాస్తు చేసుకోడానికి ఈ నెల 21 తుది గడువుగా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి(సీవోఈ) డాక్టర్ భోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంట్రన్స్ ఫీజు రూ. 1000గానూ.. ఎస్సి, ఎస్టి, వికలాంగులకు రూ.750గా నిర్ణయించినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో డెబిట్/క్రెడిట్ కార్డ్ ద్వారా లేదా టీఎస్ ఆన్‌లైన్ ఫ్రాంఛైజీ కేంద్రాలలో చెల్లించాలన్నారు. ఈ నెల 31న తెలంగాణలోని పరీక్ష కేంద్రాల్లో బిఎడ్ (జనరల్) ఉదయం 9 నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం బిఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్ష తేదీకి రెండు రోజుల ముందు తమ హాల్ టికెట్స్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 040-23680333/444/555 లో లేదా విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్‌లో సంప్రదించాలని సూచించారు.



చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరమర్శించిన ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

## మృతుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా

### ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**చేవెళ్ల, డిసెంబరు 2, ప్రభాతవార్త:** చేవెళ్ల మండలం అలూరు స్టేజీ సమీపం లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చేందిన కుటుంబాలను ఐదు లక్షల రూపాయలను ఎక్స్‌గ్రేషియాను అందజేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం రాత్రి చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలోని చికిత్స పోందుతున్న మృత దేహాలను, చికిత్స పోదుతున్న బాదితులను చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి పరిశిలించారు.

ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి గాయపడిన బాలమణికి ఉచితంగా చికిత్సను అందజేస్తామన్నారు. మృతి చేందిన నలుగురు వ్యక్తుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఐదు లక్షల రూపా యలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రమాంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్సను అందజేస్తామన్నారు. సిఎం రెవంత్‌రెడ్డితో మాట్లాడి చేవెళ్ల జాతీయ రహదారి పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి వెంట చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల కాంగ్రేస్ పార్టీ ఇన్‌చార్జి పామెన బీంభరత్ ఉన్నారు.

# గొప్ప పాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు మర్రి చెన్నారెడ్డి



మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు

### తెలంగాణ, హర్యానా గవర్నర్‌లు జిష్ణుదేవ్‌వర్మ, బండారు దత్తాత్రేయ

### 28వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

**హైదరాబాద్ (ముషీరాబాద్), డిసెంబరు 2, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ స్వర్గీయ మర్రి చెన్నారెడ్డి గొప్ప పరిపాలనా దక్షుడు, రాజనీతిజ్ఞుడు, మార్గదర్శకుడని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయలు కొనియాడారు. సోమవారం మర్రి చెన్నారెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ గార్డెన్‌లోని ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నారెడ్డి ముందుచూపు ఉన్న వ్యక్తి అని, ముందు చూపుతో తెలంగాణ ఉద్య మాన్ని చేపట్టి, రెండు సార్లు ముఖ్య మంత్రిగా, రెండు సార్లు గవర్నర్‌గా, కేంద్ర మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని సస్య శ్యామ లంగా తీర్చిదిద్దటమే చెన్నారెడ్డికి అర్పించే నిజమైన నివాళని అన్నారు. చెన్నారెడ్డి ఆశయాలను, సిద్ధాంతాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని, ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ మర్రి చెన్నారెడ్డి గొప్ప రాజకీయవేత్త అని, ఆయన స్ఫూర్తితోనే తాను ఎంపిటీసీగా, జెడ్‌పీటీసీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి, నేడు స్పీకర్ అయ్యానని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మర్రి చెన్నారెడ్డి విషయపరిజ్ఞానంతో పాటు అనుభవం గల రాజనీతిజ్ఞుడని, ఎప్పుడు ఏ వ్యక్తికి ఎలా న్యాయం చేయాలో తెలిసిన దూరదృష్టి కలిగిన మహానేత అని కొనియాడారు. మాజీ మంత్రులు సమరసింహారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రరావు, బీసీ కమీషన్ ఛైర్మన్ నిరంజన్, మాజీ ఎమ్మెల్యే, మర్రి చెన్నారెడ్డి తనయుడు మర్రి శశిధర్‌రెడ్డి, ఆయన పెద్ద కుమారుడు మర్రి రవీందర్‌రెడ్డి, మనుమలు మర్రి ఆదిత్యరెడ్డి, మర్రి పురోవర్‌రెడ్డి, దైవజ్ఞశర్మ, కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఎం.సి.మహేందర్ బాబు, కాంగ్రెస్ నేతలు వి.డి.కృష్ణ, పోతరాజు భాస్కర్, వాజిద్‌హుస్సేన్, అంజిరెడ్డి మరియు చెన్నారెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అనంతరం చెన్నారెడ్డి రాక్‌గార్డెన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంకు యువత నుండి విశేష స్పందన లభించింది.

# కాళేశ్వరరావు ఇప్పడు కూలేశ్వరావుగా మారాడు

### ఫిరాయింపులపై మాట్లాడే నైతికత హరీశ్‌కు లేదు

### బిఆర్ఎస్ రుణమాఫీ బ్యాంకు వడ్డీలకే సరిపోలేదు: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** కాళేశ్వరరావు ఇప్పడు కూలేశ్వర రావుగా మారి పోయారని మాజీమంత్రి హరీశ్‌రావుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చమత్కారం చేశారు. సిఎల్‌పి లో సోమవారం శ్రీనివాస్ మీడియాతో మాట్లా డుతూ కాంగ్రెస్‌లోకి చేరడానికి మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపణ చేశారు. గతంలో కూడా వైఎస్ఆర్‌ను కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరుతానని మెరపెట్టు కున్నారని గుర్తుచేశారు. హరీశ్‌రావు ప్రయత్నాలు ఆయన అతితెలివి చూసే ఆ సమయంలో కెసిఆర్ దూరం పెట్టారని వివరణ ఇచ్చారు. అసలు ఫిరాయింపుల గురించి మాట్లాడే హక్కు నైతికత హరీశ్‌రావుకు లేనేలేదని ఆదిశ్రీనివాస్ మండి పడ్డారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ సినిమా అయి పోయిందని ఎద్దేవా చేశారు. కెసిఆర్ హయాంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేతో ఎటువంటి ప్రయోజనం లేదని విమర్శించారు. మేం ఎవరి లెక్కలు ఎంతో తేల్చడానికి సర్వేలు చేస్తున్నామని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు బిసి కులగణనకు వ్యతిరేకమా అనుకూలమా తెలపాలని ఆయన నిలదీశారు. అక్రమ నిర్మాణాలు కూల్చాలని కెసిఆర్ అన్నారు. హైదరాబాద్ మునిగిపోవాలని బిఆర్ఎస్ నేతలు భావిస్తున్నారా అని ఆయన ప్రశ్నిం చారు. అబద్దాలు ఆడే హరీశ్‌రావు ఇప్పటికైన నిజాలు చెప్పాలని ఆయన సూచించారు. రైతుల వడ్డీ కూడా కట్టలేకపోయింది రుణమాఫీ బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేదని ఆయన అన్నారు. మేం పది నెలలలో 22వేల కోట్లు రుణమాఫీ చేశామని ఆయన తెలిపారు. వాగులు, వంకలు, కొండలుకోనలకు గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిందని ఆయన ఆరోపిం చారు. కౌలు రైతుకు బోనస్ ఇచ్చామని ఆది తెలిపారు. పదేళ్లలలో రైతుకు 80వేల కోట్లు వేశామని హరీశ్‌రావు అబద్ధాలు చెబుతున్నారని ఆయన అన్నారు. ఈ సీజన్‌లో కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క విని యోగంలోకి రాలేదని ఆయన తెలిపారు. పదేళ్లు పాలించి ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించని చరిత్ర బిఆర్ఎస్‌ది అని ఆయన అన్నారు.

# ఘనంగా తెలుగు వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

### శాంతాబయోటెక్ వరప్రసాద్‌రెడ్డికి విశిష్ట పురస్కారం ప్రదానం



డాక్టర్ వరప్రసాద్‌రెడ్డిని విశిష్ట పురస్కారంతో సత్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, వర్సిటీ సిబ్బంది, మేయర్ నీలారెడ్డి తదితరులు.

**హైదరాబాద్ (నిజాంపేట), డిసెంబరు 2, ప్రభాతవార్త :** పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బాచుపల్లి సాయినగర్‌లోని విశ్వవిద్యాలయం బాచుపల్లి ప్రాంగణం భవన సముదాయం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిధులుగా జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తదితరులు హాజర య్యారు. అనంతరం గౌరవ అతిధులు మాట్లా డుతూ సోమవారం తెలుగు విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వర్శిటీ సభ్యులకు, స్టాఫ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వర్శిటీ నూతన క్యాంపస్ బిల్డింగ్ కాంప్లెక్స్‌ను మంత్రితో కలిసి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలుగు సాహిత్యం, లలిత కళలు, సాంస్కృతిక రంగాల్లో ఎంతగానో కృషి చేసిన తెలుగు ప్రముఖులకు తెలుగు వర్శిటీ యేటా విశిష్ట పురస్కారం అందజేసి గొప్పగా సత్కరించు కుంటుందని, అందులో భాగంగానే సాంస్కృతిక విభాగం నుండి ఈసారి శాంత బయోటెక్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డాక్టర్ కోదూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డికి మంత్రి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వారి ప్రయాణం ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలవాలని కోరుకుంటూ వరప్రసాద్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగువర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానంద రావు, రిజిస్ట్రార్ హనుమంతరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ కృష్ణంరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి, మాజీ వైస్‌చాన్సలర్లు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# 7 నుండి జనవరి 2 వరకు సిఎం కప్-2024 క్రీడోత్సవాలు


### గ్రామ స్థాయి నుంచి 36 ఈవెంట్స్‌లో పోటీలు

### 7, 8లోపు ఆన్‌లైన్‌లో రిజిష్ట్రేషన్ చేసుకోవాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** తెలంగాణ ను నెంబర్ వన్ క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి జారీచేసిన దిశా నిర్దేశాలు, ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుండి జనవరి 2 వరకు 36 ఈవెంట్స్‌లో సిఎం కప్ 2024 క్రీడోత్సవాలను నిర్వహించుటకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నది. ఈ క్రీడోత్సవాలను విజయంతం చేయుటకు ఈ నెల 7,8 తేదీల లోపు సిఎం కప్2024 డాట్ తెలంగాణ డాట్‌గవ్‌డాట్‌ఇన్ నందు ఆన్లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని క్రీడాకారులకు విజ్ఞప్తి చేశారు. పోటీలలో పాల్గొనే ప్రతి క్రీడాకారుని ప్రతిభను మదింపు చేసి, ప్రోత్స హిస్తారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి , వారిని ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రధమంగా గ్రామ పంచాయతీ, మండల/మున్సిపాలిటీ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడాపోటీలు నిర్వహించ నున్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీలలో పోటీలు జరుగుతాయి. ఎన్నడూ లేనివిధంగా సమాజంలో అందరూ భాగమనే భావనతో పారా క్రీడాకారులను కూడా సిఎంకప్ 2024లో భాగస్వాములను చేయుటకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 7,8 తేదీలలో గ్రామ పంచాయితీ స్థాయి పోటీలతో దిలీఖ్బి ద్యి 2024 క్రీడోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఈ నెల 10 నుండి 12 వ తేదీ వరకు మండల / మున్సిపల్ స్థాయిల్లో క్రీడా పోటీలు జరుగుతాయి. 16 నుండి 21 వ తేదీ వరకు జిల్లా స్థాయిలోను, ఈ నెల 27 నుండి జనవరి 2 (2025)వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయి. ప్రతి క్రీడాకారునికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో 36 క్రీడ్నాశాలలో పోటీలు జరుగుతాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రమాణాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్రస్థాయి క్రీడల పోటీలను 7 చోట్ల నిర్వహించనున్నారు. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, హన్మకొండ, వరంగల్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్‌లలో నిర్దేశించిన ఈవెంట్స్‌లో రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణ కు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాట్లు చేస్తున్నది.

# ఉనికి కాపాడుకోవడానికి బిజెపి చార్జ్‌షీట్లు

### బిజెపి హయాంలో నల్లధనం పెరిగింది: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి




**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి ఉనికిని కాపాడుకోవడాని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంలో చార్జ్‌షీట్ విడుదల చేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అపహాస్యంచేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. కనీస మద్దతు ధర కల్పించాల్సింది కేంద్ర ప్రభుత్వం దీనిపై ఇప్పటివరకు స్పందన స్పష్టత లేదని ఆయన విమర్శించారు.

దేశంలో ఎక్కడ లేని విధంగా సన్న వడ్లకి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని ఆయన చెప్పారు. మద్దతుధరకి కి చట్టబద్ధత కల్పించాలేని మీరు రైతుల గురించి మాట్లాడుతారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రంలో కోటి కుటుంబాలు ఉచిత కరెంట్ రాయితీ పొందుతున్నారని ఆయన అన్నారు. గత సంవత్సరకాలంగా మహిళలకు రూ110 కోట్ల ఉచిత బస్ టికెట్లు ఇచ్చాం అని ఆయన తెలిపారు. ఏడాదికి 20వేల కోట్ల రూపాయలు వరకు సంక్షేమ కార్యక్రమాలకి ఇస్తున్నామని జీవన్‌రెడ్డి గణాంకాల చిట్టాను విప్పిచూపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాఫి చేస్తున్నారా?యుపిఎ ప్రభుత్వం హయాంలో సోనియాగాంధీ జాతీయ స్థాయిలో రుణమాపి చేసిందంటే మళ్ళీ ఇక్కడే ఆ స్థాయిలో రుణమాఫి జరిగింది. జాతీయ స్థాయిలో రుణమాఫీ చేసి ఉంటే రాష్ట్రానికి 20 వెల కోట్లు అదా అయ్యేవి అని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఇతర హామీలని కూడా అమలు చేస్తాం అని ధీమా వ్యక్తంచేశారు.

బీజేపీ నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి 10 లక్షలు వేస్తాం అన్నారు, కానీఇంకా నల్లధనం పెరిగిపోయింది అని ఎద్దేవాచేశారు. మేము రైతుల రుణమాఫి గురుంచి మాట్లాడుతుంటే బీజేపీ అంబానీ, అదానీ రుణాలు మాఫీ అంటుంది అని ఆయన విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు మాఫీ చేస్తే చేయండి కానీ అదే చేతితో రైతులకి మాఫీ చేయండి అని ఆయన అన్నారు. దేశానికి అన్నం పెట్టేది రైతు ఆయనకు అన్యాయం చేయకండి అంటూ సలహా ఇచ్చారు.



నర్సింగ్ కళాశాలను వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

## నర్సింగ్ కళాశాల, మైత్రి క్లినిక్‌లను వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తైన సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుండి వర్చువల్‌గా నర్సింగ్ కళాశాల, మైత్రి క్లినిక్‌లకు ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం వికారాబాద్ జిల్లా అనంతగిరి ప్రభుత్వ వైద్యకళాశాలలో ఆరోగ్య ఉత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఎంహెచ్ఓ వెంకటరవణ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో ప్రభుత్వనర్సింగ్ కళాశాలను, మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను మంత్రు లతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా అనంతగిరి మెడికల్ కళాశాల నందు కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారం భోత్సవం చేశారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ ఫండ్ విడుదలలో సిఎం రేవంత్ రికార్డు: సామా రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** సిఎంఆర్‌ఎఫ్ ఫండ్స్ రిలీజ్ చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రికార్డు సాధించారని ఏడాది కాలంలో రూ.830కోట్లు విడుదల చేశారని ఎక్స్‌వేదికపై కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. నాటి బిఆర్ఎస్ దొంగల పాలనకు నేటి ప్రజాపాలనకు తేడాకు ఇదే నిదర్శనం అని సామా పోల్చిచూపారు. పేదవారి ఆరోగ్యంపై కూడాపైసలు దిగమింగినది బిఆర్ఎస్ అవినీతి పందికొక్కుల పాలన చూశామని ఆయన ఆరోపిం చారు. సిఎంఆర్‌ఎఫ్ అంటేనే పారదర్శకంగా మార్చినాం పుట్ట చెవుడు, మూగ పిల్లల జీవితాలలో వెలుగునిస్తూ పేదల గుండెలు కాపాడే ఇంటి పెద్దన్న భాద్యత చూస్తున్నామని సామా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పూర్వం సగటున ఏడాదికి 480కోట్ల రూపాయలు విడుదల చేయగా ప్రస్తుతం 830కోట్ల రూపాయల చెక్కులు బాధితులకు ఇచ్చారని తెలిపారు.

## మరణించిన ప్రభుత్వఉద్యోగికి అంత్యక్రియల ఛార్జీలు పెంపు

### రూ.20 వేల నుంచి రూ.30 వేలు చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగి మరణించినప్పుడు ఇచ్చే అంత్యక్రియల ఛార్జీలను పెంచింది. ఇప్పటివరకు అంత్యక్రియల ఖర్చు రూ.20 వేలు ఉండగా, దానిని రూ.30 వేలకు పెంచుతూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి వేతన సవరణ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల్లో కూడా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మరణాంతరం ఆర్థిక సాయం ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలబడుతోంది.



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

## మాలల్లోని కొందరు స్వార్థపరులే వర్గీకరణకు వ్యతిరేకం

### వివేక్ వెంకటస్వామి వెంటనే కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలి

### ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఎస్సీ వర్గీకరణకు అడ్డుకునే శక్తి ఉంటే.. కాంగ్రెస్ పార్టీకి వెంటనే రాజీనామా చేసి ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలో చేరాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మాలల సింహగర్జన కార్యక్రమంపై మందకృష్ణ మాదిగ ఫైర్ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడేది మాలల్లో ఉండే కొందరు స్వార్థపరులేనని .. ఆ స్వార్థపరులే మనువాదులు అని కృష్ణ మాదిగ మండిపడ్డారు. బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత కాలం దళితుల విముక్తి కోసం పాటుపడ్డారని ..అయితే ఆయన లేని సమయంలో ఆయన స్ఫూర్తిని కొనసాగించాల్సిన దళిత వర్గాలు.. ఆ దళిత వర్గాల్లో ఎదిగిన మాల వర్గం ఆయన స్ఫూర్తికి భిన్నంగా.. సామాజిక న్యాయాన్ని వ్యతిరేకిస్తూ ఇవాళ ముందుకు నడుస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణని దేశంలో అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతుంటే స్వార్థపరులైన మాలలు వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. మాలలు అంబేద్కర్ వారసులు కాదని, అంబేద్కర్‌ను అవమానిస్తున్నారని ఆరోపించారు. మనువాదుల సంఖ్య మాలల్లో పెరిగిందన్నారు. దళితుల్లో ఎదిగిన వర్గం మిగిలిన వర్గాల హక్కులను హరించడానికి కుట్రలు చేస్తున్నప్పుడు వారు అంబేద్కర్ వ్యతిరేకులేనని మందకృష్ణ మాదిగ అన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ పోరాట స్ఫూర్తిని ఈ దేశంలో ముందుకు నడిపించేది మాదిగలేనని మందకృష్ణ మాదిగ అన్నారు. సామాజిక న్యాయ పోరాటానికి అడ్డు తగిలేవారే మనువాదులు అని నాడు అంబేద్కర్ పోల్చారని గుర్తుకు చేశారు. దళితుల్లో ఎదిగిన వర్గం మిగిలిన వర్గాల హక్కులను హరించడానికి కుట్రలు చేస్తున్నప్పుడు వారు అంబేద్కర్ వ్యతిరేకులేనని అన్నారు.

వివేక్ వెంకటస్వామికి ఎస్సీ వర్గీకరణకు అడ్డు తగిలే శక్తి ఉంటే.. కాంగ్రెస్కు రాజీనామా చేసి వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భైరపోగు శివకుమార్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

